సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024



ఆకట్టుకున్న 'ఓటు' విన్యాసం
వీఆర్‌పురం మండలం రేఖపల్లిలో ఓటు ఆంగ్ల పద అక్షర నమూనాలో విద్యార్థినులతో ప్రదర్శన ఆకట్టుకుంది.



ఉత్తమ సేవలకు పురస్కారం
ఉత్తమ సేవలందించిన రంపచోడవరం డైట్ అధ్యాపకుడు సోమశేఖర్‌ను పురస్కారంతో సత్కరించారు.

IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహర్ (శని)
పాడేరు, అరకు	6.15	4.32
రంపచోడవరం	6.28	4.37

న్యూస్‌రీల్

ఎస్పీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా, ఏఎస్పీ

అరకులోయ రూరల్: ఎన్నికల నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లపై గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన సమీక్షించారు. దీనిలో భాగంగా ఈవీఎంలు, ఇతర సామగ్రిని భద్రపరిచే గదులను ఆయన పరిశీలించారు. ఎన్నికల పక్రియకు ఎటువంటి అడ్డంకులు లేకుండా స్థానిక పోలీసులు తమ అధీనంలోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఏఎస్పీని ఆదేశించారు. ఎంట్రీ, అవుట్ గేట్లను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. సీఐ రుద్రశేఖర్, అరకు, డుంబ్రిగుడ ఎస్‌ఐలు సంతోష్, సంతోష్‌కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ జేఈ అభిషేక్ పాల్గొన్నారు.

మాచ్‌ఖండ్‌లో ఐదు గంటలు విద్యుత్ ఉత్పత్తి నిలిపివేత




మాచ్‌ఖండ్‌లో ఫీడర్ అనుసంధాన పనుల్లో నిమగ్నమైన ప్రాజెక్ట్ అధికారులు, సిబ్బంది

ముంచంగిపుట్టు : ఆంధ్రా ఒడిశా రాష్ట్రాల ఉమ్మడ నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో గురువారం ఉదయం విద్యుత్ ఉత్పత్తి సుమారు ఐదు గంటల పాటు నిలిపివేశారు. ప్రసుత్తం మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీటి కొరత ఉన్నందున అధికారులు గత నెల 19వ తేదీ నుంచి ఒక జనరేటర్ నుంచి మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. మాచ్‌ఖండ్ ప్రాజెక్టు ఇరు రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్నందున ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను పంచుకోవాల్సి ఉంది. ఇందులో భాగంగా ఒడిశా రాష్ట్రం జైనగర్ ఫీడర్‌లో అనుసంధాన నిమిత్తం కోసమని విద్యుత్ ఉత్పిత్తిని ఐదు గంటల పాటు నిలిపివేశారు. తీవ్రంగా శ్రమించి పనులు చేసి ఒడిశా ఫీడర్‌కు అనుసంధానం చేసినట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ ఏవీ సుబ్రహ్మణ్వేశ్వర రావు తెలిపారు. పనుల అనంతరం ఆరో నెంబర్ జనరేటర్‌లో ప్రతీ గంటకు 17 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. జోలాపుట్టు జలాశయంలో పూర్తి స్థాయి నీటి మట్టం 2750 అడుగులు కాగా ప్రస్తుతం 2702.80 అడుగుల మేర మాత్రమే నిల్వ ఉందని ఎస్‌ఈ తెలిపారు.

గంజాయి పట్టుకున్న పోలీసులకు రివార్డు

కొయ్యూరు: ఇటీవల బచింత, చీడిపాలెం జంక్షన్‌లో 1086 కిలోల గంజాయి పట్టుకున్నందుకు రివార్డు ప్రకటించారని సీఐ వెంకటరమణ,ఎస్‌ఐలు రామకృష్ణ, లోకేష్‌కుమార్ తెలిపారు. బచింతతో పాటు చీడిపాలెం జంక్షన్‌లో పట్టుకున్న గంజాయి విలువ రూ.58 లక్షల వరకు ఉంటుందన్నారు.దీనిలో భాగంగా హెచ్‌సీలు భాస్కర్ రాము,పీసీలు భాస్కర్, మూర్తి, శంకర్, కిషోర్‌కు రివార్డు ప్రకటించారని వారు పేర్కొన్నారు.

డీసీపీ-1 మణికంఠ బదిలీ



విశాఖ సిటీ: విశాఖ డీసీపీ-1 వి.ఎన్.మణికంఠ చందోలు బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లా ఎస్పీగా నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్నికల సంఘం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మణికంఠ ఈ ఏడాది జనవరి 31వ తేదీన డీసీపీ-1గా బాధ్యతలు చేపట్టారు. కేవలం మూడు నెలల మాత్రమే విశాఖలో విధులు నిర్వర్తించినప్పటికీ.. పలు కీలక కేసుల పరిష్కారంలో ప్రముఖ పాత్ర పోషించారు. చిత్తూరు జిల్లా ఎస్పీ స్థానం ఖాళీ అవడంతో ఎన్నికల సంఘం మణికంఠను అక్కడ నియమించింది.

చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది



వై.రామవరం గ్రామసచివాలయం పరిధి చీడిమానుబీధికి చెందిన నా పేరు పల్లాల లింగారెడ్డి. పదేళ్ల క్రితం రెండు కాళ్లు చచ్చుబడిపోయయి. రెండు కర్రల ఊతతో మాత్రమే నడవగలను. టీడీపీ ప్రభుత్వం హయాంలో పింఛను పొందేందుకు నానా అవస్థలు పడేవాళ్లం. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత వలంటీర్ల ద్వారా ఇంటికి పింఛను అందిస్తున్నారు. దీని వల్ల ఇబ్బందులు తప్పాయి. చంద్రబాబు రాజకీయ కుట్ర కారణంగా ఈనెల పింఛను తీసుకునేందుకు అవస్థలు పడ్డాం.

మాపై ఎందుకంత కక్ష



అరకులోయ మండలం లోతేరు పంచాయతీ తోటవలస గ్రామానికి చెందిన నా పేరు కిల్లో పార్వతమ్మ. సవ్యంగా జరిగే పింఛను పంపిణీ వ్యవస్థకు చంద్రబాబు కుట్ర రాజకీయాల వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయి. రాజకీయంగా జగన్‌మోహన్ రెడ్డిని ఎదుర్కొనలేక మాలాంటి అభాగ్యులను చంద్రబాబు అవస్థలకు గురి చేస్తున్నారు. దివ్యాంగురాలు కావడంతో మూడు కిలోమీటర్ల మేర కాలినడకన అవస్థలు పడి పింఛను పొందేందుకు వెళ్లాల్సి వచ్చింది. చంద్రబాబుకు తప్పనిసరిగా బుద్ధి చెబుతాం.

చంద్రబాబు నిర్వాకంవల్లే ఆలస్యం



చింతూరు మండలం నిమ్మలగూడెం గ్రామానికి చెందిన నా పేరు కారం రాములమ్మ. వృద్ధాప్య పింఛను లబ్ధిదారును. టీడీపీ ప్రభుత్వంలో ఎదుర్కొన్న కష్టాలు మళ్లీ ఇప్పుడు మొదలయ్యాయి. అప్పట్లో పడిగాపులు పడాల్సి వచ్చేది. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వలంటీర్ ద్వారా ఇంటివద్దకు పింఛను అందజేస్తున్నారు. వారిని దూరం చేయడం వల్ల ఈనెల పింఛను పొందేందుకు ఇబ్బందులు పడ్డాం. ప్రతి నెలా ఒకటో తేదీన అందే పింఛను మూడు రోజులు ఆలస్యమైంది.

పండుటాకుల చెంతకు..

- ఇళ్లకు వెళ్లి పింఛన్ల పంపిణీ
- ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చిన గ్రామసచివాలయ సిబ్బంది
- జిల్లావ్యాప్తంగా 75.25 శాతం మేర పూర్తి



వృద్ధురాలి ఇంటి వద్ద పింఛను అందజేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగి



రాజవొమ్మంగి గ్రామసచివాలయానికి పింఛను కోసం వచ్చిన వృద్ధులు, వితంతువులు



రంప గ్రామంలో ఇంటికి వెళ్లి పింఛను అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి

సాక్షి,పాడేరు: ప్రభుత్వ ఆదేశాలతో గ్రామ సచివాలయాల ఉద్యోగులంతా గురువారం ఉదయం నుంచే గ్రామాలకు వెళ్లి సామాజిక పింఛనుదారులకు వైఎస్సార్ పింఛన్‌కానుక సొమ్మును పంపిణీ చేశారు. గ్రామాల్లో టెంట్లు వేయడంతో పాటు కొన్ని చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల వద్ద కూడా పింఛన్లు పంపిణీ చేశారు. నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు, వృద్ధుల ఇళ్లకు గ్రామ సచివాలయాల సిబ్బంది వెళ్లి పింఛను అందజేశారు. మిగిలిన పింఛన్‌దారులు మాత్రం గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరాలకు వచ్చి నగదు తీసుకున్నారు. ఎండలో ఇబ్బందులు పడుతూ వచ్చిన పింఛనుదారులకు పంపిణీ కేంద్రాల వద్ద టెంట్లు, కుర్చీలు ఏర్పాటుచేశారు.జిల్లాలోని 22 మండలాల్లో రాత్రి 8.30 సమయానికి 75.25 శాతం మేర పంపిణీ పూర్తి చేశారు. జిల్లాలో 1,27,894 మంది సామాజిక పింఛన్‌దారులు ఉండగా ప్రభుత్వం రూ.38 కోట్ల 79లక్షల 85వేలు విడుదల చేసింది.బుధవారం నుంచి గురువారం రాత్రి వరకు 96,240 మందికి పింఛన్ల సొమ్ము రూ.29,41,37,000 పంపిణీ చేసినట్టు కలెక్టర్ విజయ సునీత తెలిపారు.

మండలాల వారీగా ఇలా..

కూనవరం మండలంలో 4021మందికి 3707, గంగవరంలో 4019మందికి 3655, వీఆర్‌పురంలో 3766 మందికి 3368, రంపచోడవరంలో 4649 మందికి 4203, హుకుంపేట మండలంలో 7325 మందికి 6394, అరకులోయలో 6630 మందికి 5887, మారేడుమిల్లిలో 2039 మందికి 1786, ఎటపాకలో 6195 మందికి 5180, చింతూరులో 5169 మందికి 4238, పాడేరులో 6714 మందికి 5758, కొయ్యూరులో 7802 మందికి 6525, ముంచంగిపుట్టు 6387 మందికి 5153, దేవీపట్నంలో 4475 మందికి 3460, అనంతగిరిలో 6174 మందికి 4567, వై.రామవరంలో 3403 మందికి 2372, అడ్డతీగలలో 5565 మందికి 4167, డుంబ్రిగుడలో 6580 మందికి 4405, పెదబయలులో 6257 మందికి 4033, రాజవొమ్మంగిలో 6594 మందికి 4179, చింతపల్లిలో 9623 మందికి 5701, జి.మాడుగులలో 6649 మందికి 3792, జీకేవీధి మండలంలో 7858 మందిలో 3710కు పింఛన్ల పంపిణీ చేశారు. మిగిలిన పింఛనుదారులకు శుక్రవారం నాటికి పూర్తి చేస్తామని కలెక్టర్ విజయసునీత తెలిపారు.

వీఆర్‌పురం ప్రథమస్థానం

- 90 శాతం మేర పంపిణీ

వీఆర్‌పురం: మండలంలో పింఛన్ల పంపిణీ రెండు రోజుల వ్యవధిలో 90 శాతం మేర పూర్తయి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంపీడీవో ఆర్.ఫణేంద్రరెడ్డి గురువారం తెలిపారు. మండలంలోని 8 సచివాలయాల్లో రెండవ రోజు కూడా పింఛన్ పంపిణీ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగింది. మండలంలో మొత్తం 3777 మంది పింఛన్‌దారులకు రూ.1.13 కోట్ల మేర నగదు పంపిణీ చేయాల్సి ఉంది. ఇందులో రూ.1.01 కోట్లు పంపిణీ చేశామని, మిగతా పదిశాతం అంటే రూ.12 లక్షలు చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.



వనుగుపల్లి పంచాయతీ పరిధిలో టెంట్ వేసి పింఛన్లను పంపిణీ చేస్తున్న సిబ్బంది



చింతూరు గ్రామ సచివాలయంలో పింఛను అందజేస్తున్న సిబ్బంది



యండపల్లి వలసలో పింఛన్లను పంపిణీ చేస్తున్న గ్రామ సచివాలయ సిబ్బంది

చంద్రబాబు కుయుక్తుల వల్లే అవస్థలు

- మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి
- ఆయన కొనసాగితేనే మా పింఛన్లకు భరోసా
- సంక్షేమంతో కులాసాగా పేద బతుకులు
- చంద్రబాబు వస్తే మాలాంటోళ్లకు అధోగతే..
- నోటికాడ కూడు తీసేస్తాడంటూ ఆందోళన
- అవస్థలు పడుతున్నామని పింఛనుదారుల ఆవేదన

సాక్షి, విశాఖపట్నం : ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు, పింఛన్లు పుణ్యమాని ఐదేళ్లు నోట్లోకి వెళ్తున్నాయన్న ధీమా అందరిలోనూ ఉంది. అయితే ఇటీవల జరుగుతున్న పరిణామాలు వీరి ఆందోళనకు కారణమవుతోంది. గ్రామ/వార్డు వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి పెన్షన్లతో పాటు పలు సంక్షేమ పథకాలను వారి ద్వారా ప్రజలకు నేరుగా అందేలా సీఎం జగన్ చర్యలు చేపట్టారు. ఈ వ్యవస్థతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. అలాంటి విజయవంతమైన వలంటీర్ల వ్యవస్థను లేకుండా చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు చేస్తున్న కుట్రలు, కుయుక్తులను వీరు కళ్లారా చూస్తున్నారు. మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో చంద్రబాబు బ్యాచ్ వలంటీర్లను ప్రజలకు దూరం చేసే ఎత్తుగడ వేసింది. దీంతో ఎన్నికలయ్యే దాకా వారిని దూరం పెట్టాలంటూ ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రతి నెలా ఒకటో తేదీనే అవ్వా తాతల ఇళ్లకెళ్లి వారి చేతిలోనే పెన్షను సొమ్మును అందజేసే వీలు లేకుండా పోయింది. అంతేకాదు.. ఎక్కడో దూరంగా ఉన్న గ్రామ/వార్డు సచివాలయాలకు వెళ్లి పింఛన్ డబ్బు తీసుకునే పరిస్థితి వచ్చింది. అదీ మండుటెండల్లో పండుటాకులు వెళ్లి రావడానికి ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఇన్నాళ్లూ ఇంటికే పెన్షను తీసుకొచ్చి ఇచ్చే వారికి అడ్డుపడి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ చంద్రబాబుపై వీరు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. 2019కి ముందు ఆయన హయాంలో ఇలాంటి పరిస్థితే ఉండేదని వీరంతా గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థనే కాదు.. సంక్షేమ పథకాలతో పాటు పింఛన్లకూ గండి కొడతారని, నోటి కాడ కూడు తీసేస్తారేమోనని ఆందోళన చెందుతున్నారు. అందుకే అవ్వా తాతలు, వితంతువులు, దివ్యాంగులు, కిడ్నీ రోగులు తదితరులు కలవర పడుతున్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- పాడేరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, జేసీ భావన వశిష్ట
- సెక్టోరల్ అధికారులకు సూచన





మాట్లాడుతున్న పాడేరు అసెంబ్లీ ఆర్వో భావన వశిష్ట, హాజరైన ఎన్నికల విభాగం అధికారులు

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికల్లో అధికారులంతా అంకిత భావంతో బాధ్యతగా విధులు నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్, పాడేరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి భావన వశిష్ట ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశమందిరంలో పాడేరు నియోజక వర్గ సెక్టోరల్ అధికారులకు గురువారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా 3వ విడత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెక్టోరల్ అధికారులందరికీ పోలింగ్‌కు వారం రోజుల ముందు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అధికారాలు వస్తాయన్నారు.వీరంతా తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రం, రూటులపై పూర్తిగా అవగాహన ఉండాలని ఆదేశించారు. మాక్ పోలింగ్,పోలింగ్ ప్రక్రియ సకాలంలో నిర్వహించేలా పోలింగ్ అధికారులను సన్నద్ధం చేయాలని సూచించారు. ఈనెల 8వతేది నుంచి పోలింగ్ అధికారులకు పాడేరు గురుకుల విద్యాలయంలో ఎన్నికలు నిర్వహణ, పోలింగ్ ప్రక్రియపై శిక్షణ అందిస్తామని, సెక్టోరల్ అధికారులు కూడా శిక్షణకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. తాము పంపిణీ చేసిన హ్యాండ్ బుక్‌లను క్షుణంగా చదివి ఎన్నికల విధులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో పద్మావతి పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సులు

రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



ఓటు హక్కు వినియోగంపై నిర్వహించిన ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

రంపచోడవరం: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్టు రంపచోడవరం సబ్ కలెక్టర్, అసెంబ్లీరిటర్నింగ్ అధికారి ఎస్. ప్రశాంత్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాలకు ఓటు వినియోగంపై ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు వంద మంది పాల్గొనగా ప్రతీ ఒక్కరికి బహుమతులు అందజేస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మహిళలు నిర్భయంగా టు హక్కు వినియోగించుకునే విధంగా ఈ పోటీలు దోహదపడతాయన్నారు. ఓటు వినియోగంపై సాటి మహిళలకు అవగాహన కల్పించాలని వారికి ఆయన సూచించారు. 18 సంవత్సరాల నిండిన యువత ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 399 పోలింగ్ కేంద్రాలు ఉండగా 59 మంది సెక్టోరల్ పనిచేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.నియోజకవర్గంలో మహిళా ఓటర్లు 1,44 570, పురుష ఓటరుల్లు 1,31,088, థర్డ్ జెండర్ 15, దివ్యాంగులు 3,388, వృద్ధులు 1561, యువతీయువకులు 4249 మంది చొప్పున 11 మండలాల్లో 2,75,673 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం తహసీల్దార్ ఏ.కృష్ణజ్యోతి, డీటీ బి.రాజు, ఏవో డీఎస్పీ రమణ, సీడీపీవో సంధ్యారాణి, చెల్లాయమ్మ, గణపతి పాల్గొన్నారు.

ఓటు అత్యంత విలువైనది

వీఆర్‌పురం: ఓటు అనేది అత్యంత విలువైందని తహసీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్ అన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థినులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోజనులైన ప్రతీ ఒక్కరూ తమకు నచ్చిన వ్యక్తికి ఓటు వేసే హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థినులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో చిన్నపిల్లల వార్డు పునఃప్రారంభం



వార్డును పునఃప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఆధునికీకరణ పనులు పూర్తయిన చిన్నపిల్లల ఐసీయూ(పీఐసీయూ) వార్డును కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం పునఃప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు. చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రూ.80 లక్షల నిధులతో ఆధునికీకరణ పనులు చేపట్టారు. అలాగే కార్డియాలజీ (సీటీవీఎస్) విభాగంలో రూ.25 లక్షల నిధులతో గుండె శస్త్రచికిత్స ఐసీయూ, వార్డుల ఆధునికీకరణ, రూ.15 లక్షలతో గైనిక్, ఫ్యామిలీ ప్లానింగ్ విభాగ అనుసంధాన వారధి (ర్యాంప్) పనులు పూర్తయిన సందర్భంలో జిల్లా కలెక్టర్ ఆయా విభాగాలను సందర్శించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, చిన్నపిల్లల వార్డు విభాగాధిపతులు డాక్టర్ చక్రవర్తి, వైద్యాధికారులు ఎడి శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే
- పీహెచ్‌సీల వైద్యసిబ్బందికి ఆదేశం
- దోమల నివారణ మందు పిచికారీని పర్యవేక్షించాలని సూచన



మారేడుమిల్లిలో క్వార్టర్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం/మారేడుమిల్లి: ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. మారేడుమిల్లి మండలంలోని బోదులూరు, మారేడుమిల్లి పీహెచ్‌సీలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఈ ఏడాది మలేరియా ప్రబలకుండా ప్రతీ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే నిర్వహించాలని సూచించారు. మలేరియా దోమల నివారణ మందు పిచికారీని పర్యవేక్షించాలని వైద్యాధికారులను ఆదేశించారు. మలేరియా నిర్ధారణ కోసం ఆర్‌డీ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మలేరియా నిర్ధారణ అయితే మందులు ఇవ్వాలన్నారు. పీహెచ్‌సీకి వచ్చే రోగుల సంఖ్యను తెలుసుకున్నారు. పీహెచ్‌సీ పరిధిలో ప్రసవానికి దగ్గర గడువు ఉన్న వారిని బర్త్‌వెయింటింగ్ హాళ్లకు తరలించాలని సూచించారు. రెండు పీహెచ్‌సీల్లో రికార్డులు తనిఖీ చేశారు. మారేడుమిల్లి గ్రామంలో వైద్యాధికారులకు నిర్మిస్తున్న క్వార్టర్లను , హెల్త్ బ్లాక్ యూనిట్ నిర్మాణ పనులను పీవో పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏడీ ఎంఅండ్‌హెచ్‌వో ప్రకాశం, వైద్యాధికారులు హరికృష్ణ, సంతోష్, సతీష్, చైతన్య,రాణి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

కలెక్టర్ విజయ సునీత



బాలికలకు కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ విజయ సునీత



బాలసదనం బాలికలతో కలెక్టర్ విజయ సునీత



బాలికలకు ట్రంక్ పెట్టెలను పంపిణీ చేస్తున్న జేసీ భావన వశిష్ట, ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న బాలికలంతా బాగా చదివి,ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఎం.విజయసునీత ఆకాంక్షించారు. స్థానిక ఐసీడీఎస్ బాలసదనాన్ని గురువారం ఆమె సందర్శించారు. విద్యార్థినులతో ఆమె మాట్లాడారు. చాలా సమయం వారితో గడిపారు. , ఆటపాటలతో బాలికలు సందడి చేశారు. ఐసీడీఎస్ సంస్థ అందుబాటులో తెచ్చిన పలు మెటీరియల్ కిట్లను బాలికలకు కలెక్టర్ పంపిణీ చేశారు. రెండు వాషింగ్ మెషీన్లు, ఫ్రిజ్, స్మార్ట్ టీవీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మావతి,ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి,సూపర్‌వైజర్ ఉర్మిల పాల్గొన్నారు. ఇలావుండగా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ బాల సదనాన్ని సందర్శించారు. ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రిని బాలికలకు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

పలువురు సీనియర్ సివిల్ జడ్జిలకు బదిలీ

అల్లిపురం : రాష్ట్రవ్యాప్తంగా హైకోర్టు గురువారం పలువురు సీనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో విశాఖకు చెందిన పలువురు సీనియర్ సివిల్ జడ్జిలు బదిలీ అయ్యారు. ప్రస్తుత ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కేవీఎల్ హిమబిందు శ్రీకాకుళం ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కడప అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్ కుమార్ బదిలీపై వస్తున్నారు. ఒకటో అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సీహెచ్ యుగంధర్ శ్రీకాకుళం అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలోకి తూర్పు గోదావరి జిల్లా కాకినాడ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎంవీ పద్మజ బదిలీపై వస్తున్నారు. నాల్గో అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ టీవీ రాజేష్‌కుమార్ విజయనగరం అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చిత్తూరు జిల్లా పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జి కె. వాసుదేవరావు బదిలీపై వస్తున్నారు. విశాఖ ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేకానంద్ శ్రీనివాస్ శ్రీకాకుళం జిల్లా రాజాం సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కడప ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత బదిలీపై వస్తున్నారు.

కిరండూల్ పాసింజర్‌కు థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్

తాటిచెట్లపాలెం : వేసవి వేళ ప్రయాణికుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో నడుస్తున్న విశాఖపట్నం – కిరండూల్ – విశాఖపట్నం (08551 /08552) పాసింజర్ స్పెషల్ రైలుకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ఏప్రిల్ 8 నుంచి జూలై 1 వరకు థర్డ్ ఏసీ ఎకానమి కోచ్ జత చేస్తున్నామని, ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు.

వాల్తేర్ డివిజన్, కేకే లైన్ పరిధి బొర్రా గుహలు – కరకవలస స్టేషన్ల మధ్య బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు చేపడుతున్నందున ఏప్రిల్ 10న విశాఖపట్నం – కిరండూల్ (08551), కిరండూల్ – విశాఖపట్నం(085520 పాసింజర్ రైళ్ల ఇరువైపులా రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

వృద్ధురాలిపై లైంగిక దాడి?

ఎంవీపీకాలనీ: వృద్ధురాలిపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జాలరిపేటకు చెందిన ఇద్దరు అకతాయి యువకులు సుమారు 55 ఏళ్ల వయసు గల వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిసింది. మద్యం మత్తులో వారు ఈ దాడికి పాల్పడినట్లు సమాచారం. వృద్ధురాలు దాడి ఘటనను ఎంవీపీ పోలీసుల దృష్టికి తీసుకురాగా.. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ విజయపతాకం ఎగురవేయాలి

పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ(అరకులోయటౌన్): అరకులోయ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. డుంబ్రిగుడ మండలం జైపూర్ జంక్షన్ వద్ద మండలస్థాయి సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె మాట్లాడారు. డుంబ్రిగుడ మండలం వైఎస్సార్సీపీకి కంచుకోట అని రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనుజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మనమంత జగన్ ఎజెండాకు విధేయులై పనిచేసి నాయకులు, కార్యకర్తలు గౌరవింపబడాలన్నారు. గిరిజన ప్రాంతంలో ఓటు అడిగే హక్కు ఒక్క వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేసి వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురువేద్దామన్నారు. కార్యక్రమంలో అతిథిగా విచ్చేసిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ డుంబ్రిగుడ మండలవాసులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంటే అమితమైన ప్రేమ ఉందన్నారు. మండలంలో టీడీపీ, జనసేన, బీజేపీలకు అడ్రస్ ఉండదన్నారు.రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగంలను గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అరకు అసెంబ్లీ పరిశీలకురాలు హైమవతి మాట్లాడుతూ గిరిజనులంతా జగనన్నకు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని, మనం కేవలం ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలను గ్రామ స్థాయిలో తీసుకెళ్లి ఓటర్లను చైతన్యం పరిచి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి తనూజరాణి మాట్లాడుతు తన మామ్మయ్య ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ భర్తవి నయ్ పార్టీకు చేసిన సేవల వల్ల తనకు జగనన్న ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించారని తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజసేవ చేస్తానన్నారు. అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం మాట్లాడుతు రానున్న ఎన్నికల్లో అందరూ సమన్వయంగా పనిచేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించి మరోసారి జగనన్నను సీఎం చేద్దామన్నారు. అనంతరం యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ జన్మదిన వేడుకల్లో భాగంగా కుక్ కట్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, ఎంపీపీ ఈశ్వరి, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనంద్, లలిత, మండల కన్వీనర్ గణపతి, సర్పంచ్‌లు నాగేశ్వరరావు, శారద, ఎంపిటీసీ సభ్యురాలు వరహాలమ్మ, లీగల్ సెల్ ప్రతినిధి మురళీమోహన్, మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు శాంతి, నాయకులు సింహాచలం, కృష్ణారావు, పాప్పారావు, శెట్టి గోపాల్, గృహసారథులు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే గిరిజన ప్రాంతాల అభివృద్ధి

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



వినాయకపురంలో మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

ఎటపాక: ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి పాలనలోనే గిరిజన ప్రాంతాల అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. గురువారం ఎటపాక మండలంలోని వినాయకపురం, పూసుకుగూడెం, ఎర్రబోరు, విస్సాపురం, సుద్దగూడెం, మాధవరావుపేట, చినబండిరేవు, కన్నాపురం, అచ్యుతాపురం, కృష్ణవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించి గిరిజన కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసిన ఘనత జగనన్నదని చెప్పారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడుభూములకు హక్కు పత్రాలు ఇచ్చి వారి కుటుంబాల్లో వెలుగులు నింపారని అన్నారు. ఎటువంటి అవినీతికి తావులేకుండా లబ్ధిదారుల ఖాతాల్లో సంక్షేమ పథకాల నగదు జమచేసి అవినీతి రహిత పాలన అందించారని అన్నారు. కుట్రలు కుయుక్తులతో మోసపూరిత హామీలిచ్చి మిమ్ముల్ని మోసం చేసేందుకు టీడీపీ కూటమి నేతలు గ్రామాల్లోకి వస్తారని, వారికి ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లు పొడియం జ్యోతి, కృష్ణ, కామేశ్వరరావు, ఎంపీటీసీలు వెంకటరామిరెడ్డి, అంజలి, సర్పంచ్‌లు, సచివాలయాల మండల కన్వీనర్ గోసు ప్రశాంత్, సొసైటీ చైర్మన్ పసుపులేటి లక్ష్మణరావు, పార్టీ మండల కన్వీనర్ తానికొండ వాసు, ఉపాధ్యక్షులు ఆకుల వెంకటరామారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మంత్రిప్రగడ నర్సింహరావు, రంబాల నాగేశ్వరరావు, లక్ష్మణ్, కోటి, నవీన్, కురినాలవెంకట్, శివ, కృష్ణబాబు పాల్గొన్నారు.

పార్టీ విజయమే అందరి లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజరాణి



సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కన్వీనర్లు తదితరులు

హుకుంపేట: పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేసి రానున్న ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనుజారాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్యలింగంను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కష్టపడి పనిచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి బాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మండల నాయకులతో పాటు పంచాయతీల పరిధిలో సర్పంచ్, ఎంపిటీసీలు, సచివాలయం, బూత్ కన్వీనార్లు, గృహసార్థులు బాగ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనుజారాణి మాట్లాడుతూ తనను ఎంపి అభ్యర్థిగా అవకాశం ఇచ్చినందుకు సీఎం జగనన్నకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. నాయకులంతా తమకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం మాట్లాడుతు వచ్చే ఎన్నికల్లో నాయకులంత సమష్టిగా పని చేస్తు తమకు అత్యదిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. భవిష్యత్‌లో నాయకులకు ఏ లోటు రాకుండా అందరికి అందుబాటులో ఉంటానన్నారు. తమ గెలుపునకు కృషి చేసిన నాయకులకు ఏ విధంగా ఇబ్బంది కలగకుండా అందరికి సహకారిగా ఉంటానన్నారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతు ఐదేళ్లలో హుకుంపేట మండలానికి రూ.23 కోట్లతో సంక్షేమ పథకాలు, రూ.80కోట్లతో రోడ్లు నిర్మాణాలకు ప్రభుత్వం ఖర్చు వెచ్చించిందన్నారు. గ్రామల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై గిరిజనులకు నాయకులు కార్యకర్తలు వివరించాలని కోరారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగం, ఎంపీ అభ్యర్థి తనూజరాణిలను గెలుపే లక్ష్యంగా అందకు పని చేయాలని కోరారు.

ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతు ఎన్నికలకు సమయం చాల తక్కువగా ఉన్న నేపథ్యంలో సమయం వృథా చేయకుండా అందరు సమష్టిగా పార్టీ విజయం కోసం పని చేయాలన్నారు.

అసెంబ్లి నియోజకవర్గం పరిశీలకులు శోభ హైమవతి మాట్లాడుతు గ్రామల్లో సర్పంచ్‌లు, ఎంపిటీసీలు వారి పరిధిలో ఉన్న ప్రదాన నాయకులు ,కన్వినర్లు, గృహాసారథులను కలుపుకుంటు సమన్వయంగా పని చేయాలని వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మండల సర్పంచ్‌లు, ఎంపిటీసీలకు విడివిడిగా ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి పార్టీ గెలుపునకు పాటించాల్సిన విషయాలను తెలియజేశారు. స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, ఎంపీపీ కూడా రాజుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జేసీయస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, వాణిజ్యా విభాగ జిలా అధ్యక్షుడు ఒంటుబు శ్యాముల్, సర్పంచ్, ఎంపిటీసీల పోరం అధ్యాక్షులు కాకరి బొంజుబాబు,కొర్ర నాగరాజు సర్పంచ్‌లు ఎంపిటీసీలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో ప్రాధాన్యం



చట్టి గ్రామంలో ఓటుహక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఐటీడీఏ పీవో చైతన్య

చింతూరు: ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉందని, తమ ఓటుహక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. చింతూరు మండలం చట్టిలో గురువారం ఓటర్ల అవగాహన కార్యక్రమంలో భాగంగా కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీవో చైతన్య మాట్లాడుతూ ఓటు విలువను అందరూ తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వీలుంటుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని పీవో సూచించారు. తహసీల్దార్ నజీముల్లాషా, ఏపీపీ స్వామినాయుడు, ఆర్ఐ దేవయ్య పాల్గొన్నారు.


ఉత్తమ సేవలకు పురస్కారం

రంపచోడవరం డైట్ అధ్యాపకుడు సోమశేఖర్‌కు సత్కారం

రంపచోడవరం: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ప్రథమ వార్షికోత్సవం, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, శతాధిక గ్రంథకర్త పడాల రామారావు 18వ స్మారకోత్సవం రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తూర్పుగోదావరి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డా. కర్రి రామారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందరర్భంగా సంఘ సేవకులు, సాహితీవేత్తలకు పడాల స్మారక పురస్కారాలను అందించారు. ఇందులో భాగంగా రంపచోడవరం ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కళాశాల సైకాలజీ అధ్యాపకుడు కంఠంరెడ్డి సోమశేఖర్‌కు పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో అందించిన సేవలు, గ్రామీణ ప్రాంతాల్లో విద్యావ్యాప్తికి కృషి, ఉన్నత విద్య పూర్తిచేసి పౌరాణిక కళాకారునిగా కొనసాగడం వంటి విషయాలను దృష్టిలో కి తీసుకుని ఆయనకు పురస్కారం అందజేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం అల్లూరి సీతారామరాజు యువజన సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు సారథ్యంలో నిర్వహించారు. నిర్వహించడం జరిగింది. పురస్కార గ్రహీతను డీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. చినబాబు, మారేడుమిల్లి, రంపచోడవరం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు అరుణ కుమారి,విఠల్,బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు అభినందించారు.

ఏకాకి.. బండారు!

- టీడీపీ కింది స్థాయి నేతల టచ్‌లోకి పంచకర్ల
- మాజీ మంత్రిని పక్కన పెట్టేసిన వైనం
- 43 ఏళ్ల సీనియర్‌కు అవమానాలు
- ఎక్కడికక్కడ బండారు వర్గాన్ని వెక్కిరిస్తున్న జనసేన క్యాడర్



పెందుర్తి: జగమంతా కుటుంబం నాది.. ఏకాకి జీవితం నాది అన్నట్లు తయారైంది 43 ఈయర్స్ పొలిటికల్ ఇండస్ట్రీ బండారు సత్యనారాయణమూర్తి పరిస్థితి. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా, టీడీపీలో రాష్ట్ర స్థాయి నేతగా గుర్తింపు పొందిన బండారు ప్రస్తుతం ఇంటి నుంచి బయటకు రాలేని దుస్థితి నెలకొంది. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అభ్యర్థిగా పెందుర్తి బరిలో ఉన్న పంచకర్ల రమేష్‌బాబు తన చిరకాల ప్రత్యర్థి బండారు సత్యనారాయణమూర్తిని క్రియాశీల రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకునేలా చేశారు. కూటమి అభ్యర్థిగా ఉన్న రమేష్‌బాబు ప్రధాన పార్టీ టీడీపీని కలుపుకుని వెళ్లాల్సింది పోయి.. దొడ్డిదారిలో టీడీపీలో బండారు వ్యతిరేక వర్గాన్ని చేరదీస్తున్నారు. అదే సమయంలో నియోజకవర్గంలో అడుగడుగునా బండారు వర్గానికి జనసేన క్యాడర్ నుంచి తీవ్రస్థాయిలో అవమానాలు ఎదురవుతున్నాయి. 'మాకు మీ అవసరం లేదు'అంటూ బండారు వర్గాన్ని మరింత రగిలిపోయేలా చేస్తున్నారు.

అధినేత నుంచే అవమానం

జనసేన–టీడీపీ జత కట్టిన దగ్గర నుంచి సీనియర్, స్థానికుడైన బండారు సత్యనారాయణమూర్తి పెందుర్తి టికెట్‌పై గంపెడాశలు పెట్టుకున్నారు. చంద్రబాబు, లోకేష్ కూడా పలు బహిరంగ వేదికల్లో బండారుకే టికెట్ అన్నట్లు సంకేతాలిచ్చారు. తీరా ఆఖరి నిమిషంలో బండారును కాదని కొద్ది రోజుల కిందట జనసేన తీర్థం పుచ్చుకున్న స్థానికేతరుడు పంచకర్లకు పెందుర్తి టికెట్ కేటాయించారు. బండారుకు టికెట్ ఇవ్వకపోగా.. కనీసం ఆయన అభిప్రాయాన్ని కూడా చంద్రబాబు పరిగణలోకి తీసుకోలేదు. ఒకవైపు టికెట్ నిరాకరించడం.. మరోవైపు తన చిరకాల ప్రత్యర్థి అయిన రమేష్‌బాబుకు టికెట్ ఇవ్వడంతో బండారు రగిలిపోతున్నారు. నిద్రాహారాలు కూడా సరిగా లేకపోవడంతో కొద్ది రోజుల కిందట అనారోగ్యం పాలయ్యారు. అయినా కూడా టీడీపీ అధిష్టానం నుంచి కనీసం పరామర్శ లేదని బండారు వర్గం అగ్గిమీద గుగ్గిలమవుతోంది.

బండారా.. డోంట్ కేర్ : ఇదిలా ఉండగా జనసేన నుంచి కూడా బండారుకు తొలి నుంచి అవమానాలే ఎదురవుతున్నాయి. ఇరు పార్టీలు జతకట్టిన తర్వాత తప్పదన్నట్లు అప్పుడప్పుడు కలసి తిరిగినా.. బండారు–పంచకర్ల బంధం టికెట్ కేటాయించిన తర్వాత అతుక్కునే ప్రయత్నమే జరగలేదు. బెర్త్ ఖాయం చేసుకొని పెందుర్తి నియోజకవర్గంలో అడుగుపెట్టిన పంచకర్ల రమేష్‌బాబు మర్యాద కోసమైన బండారును పలకరించలేదు. ఇంటికే పరిమితమైన బండారు లేకపోతే మాకేంటి అనే రీతిలోనే జనసేన తీరు ఉంది తప్పితే.. పొత్తు ధర్మం కోసం పంచకర్ల వర్గం బండారును కలుపుకునే ప్రయత్నం చేయలేదు. కాగా.. కొద్ది రోజులుగా బండారుపై కాస్తో కూస్తో అసంతృప్తిగా ఉన్న కిందిస్థాయి నాయకులతో పంచకర్ల టచ్‌లోకి వెళ్లడంతో.. బండారు వర్గం తీవ్రస్థాయిలో రగిలిపోతోంది. నాలుగు దశాబ్దాలుగా నియోజకవర్గంలో టీడీపీని మోసిన బండారు సత్యనారాయణమూర్తికి జనసేన నుంచి ఇన్ని అవమానాలా? అంటూ టీడీపీ పాత కాపులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బై.. బై.. వైజాగ్



విశాఖ నుంచి బయలుదేరిన ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్



ముంబాయికి వెళ్తున్న బాలీవుడ్ హీరో షారుక్‌ఖాన్

గోపాలపట్నం: ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ), కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) జట్లు విశాఖ నుంచి తిరుగు ప్రయాణమయ్యాయి. విశాఖ విమానాశ్రయం నుంచి గురువారం మధ్యాహ్నం కేకేఆర్ జట్టు చెన్నైకు, సాయంత్రం డీసీ జట్టు ముంబయికి ప్రత్యేక విమానంలో బయలుదేరాయి. వీరికి అభిమానులు ఘనంగా వీడ్కోలు పలికారు. సీఎస్‌కేతో జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించిన డీసీ.. కేకేఆర్‌తో జరిగిన మ్యాచ్‌లో భారీ ఓటమి చవిచూసింది. డీసీతో జరిగిన మ్యాచ్‌ను ఎంజాయ్ చేసిన కేకేఆర్ జట్టు యజమాని షారుఖ్‌ఖాన్ కూడా ప్రత్యేక విమానంలో ముంబయి వెళ్లారు.



బయలుదేరిన కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు

అకా'డమ్మీ'

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న కోచింగ్ సెంటర్లు
- ప్రభుత్వ అనుమతుల్లేకుండానే నిర్వహణ
- ఇంటర్ విద్యార్థులే టార్గెట్‌గా దోపిడీ
- ఐఐటీ, జేఈఈ, నీట్ పేరుతో రూ.లక్షల్లో వసూలు
- కోచింగ్ సెంటర్ల లెక్క తీస్తున్న అధికారులు



విశాఖ నగరంలోని జీవీఎంసీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఓ సంస్థ అకాడమీ ఏర్పాటు చేసింది. ఇంటర్ బోర్డు నుంచి ఎటువంటి అనుమతుల్లేకుండానే ఇక్కడ విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చేస్తోంది. శ్రీనగర్ బుధిల్ పార్కు సమీపంలోని ఓ కోచింగ్ సెంటర్‌కు ప్రభుత్వ పరంగా ఎటువంటి అనుమతుల్లేవు. వన్‌టౌన్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఇంటర్మీడియట్ అడ్మిషన్లు కల్పించి.. శ్రీనగర్‌లో కోచింగ్ ఇస్తోంది. ఐఐటీ, నీట్ ఎంట్రన్స్ పేరిట ఒక్కో విద్యార్థి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఫీజు వసూలు చేస్తోంది.

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ విద్యార్థులే టార్గెట్‌గా విశాఖ కేంద్రంగా అకాడమీల పేరిట కోచింగ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకున్నప్పటికీ.. ఆర్భాటపు ప్రచారాలతో విద్యార్థులను నిర్వాహకులు చేర్చుకుంటున్నారు. ఐఐటీ, జేఈఈ, ఎంసెట్, నీట్, సీఏ ఎంట్రన్స్‌ల్లో ర్యాంకుల బూచి చూపించి.. సీటు గ్యారెంటీ పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

ఏదైనా విద్యాసంస్థ ప్రారంభించాలంటే విద్యాశాఖ, ఫైర్, పోలీస్, జీవీఎంసీ అనమతులు తప్పనిసరిగా ఉండాలి. ఆయా శాఖల నుంచి లైసెన్సు పొందేందుకు నిర్దిష్టమైన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ప్రైవేట్ వ్యక్తుల అజమాయిషీలో నిర్వహిస్తున్న అకాడమీల ద్వారా అటు ప్రభుత్వానికి గానీ.. ఇటు నగర పాలకసంస్థ కు కానీ ఒక్క రూపాయి కూడా ఆదాయం రావడం లేదు. ప్రభుత్వ కాలేజీల్లో పనిచేసే కొంతమంది అధ్యాపకులు సైతం ఇక్కడ గెస్ట్ ఫ్యాకల్టీగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.

తల్లిదండ్రుల ఆశలతో వ్యాపారం

తమ పిల్లలు ఇంజినీరో.. డాక్టరో కావాలనే తపనపడే తల్లిదండ్రులను టార్గెట్‌గా చేసుకుని అకాడమీల నిర్వాహకులు విద్యా వ్యాపారం చేస్తున్నారు. పోటీ పరీక్షల్లో ర్యాంకుల పేరుతో ఇరుకు గదుల్లో కూర్చోబెట్టి రేయింబవళ్లు ప్రిపరేషన్ పేరిట విద్యార్థులను తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొన్ని కార్పొరేట్ కాలేజీల్లో విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఇలానే దొండపర్తి సెంటర్‌లోని వసతి గృహంలో ఓ విద్యార్థిని ఆత్మహత్య సంఘటన తీవ్ర దుమారం రేపింది. ఎటువంటి అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న అకాడమీలు, వాటికి అనుబంధంగా ఉన్న వసతి గృహాల్లో ఏదైనా జరగరాని సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు.. ఎవరిపై చర్యలు తీసుకోవాలనే దానిపై అధికారులు సైతం తర్జనభర్జన పడుతున్నారు.

అకాడమీల లెక్కతీస్తున్న అధికారులు

ఎటువంటి అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న అకాడమీ, కోచింగ్ కేంద్రాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో సంబంధిత శాఖల అధికారులు వీటిపై ఫోకస్ పెట్టారు. కోచింగ్ కేంద్రాలకు గుర్తింపు ఇవ్వడం ద్వారానే వీటిపై నియంత్రణకు ఆస్కారం ఉంటుందని భావించిన ఉన్నతాధికారులు.. దీనిపై కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న అకాడమీ, కోచింగ్ కేంద్రాల వివరాలను సేకరిస్తున్నారు.


తప్పు ప్రకటనలు ఇస్తే చర్యలు



కోచింగ్ కేంద్రాలు, అకాడమీల విషయంలో ఏం చేయాలనే దానిపై ఉన్నత స్థాయిలో సమీక్ష జరుగుతోంది. విద్యార్థులను ప్రలోభాలకు గురిచేసేలా తప్పుడు ప్రకటనలు ఇస్తే, అలాంటి వారిపై చర్యలకు సిఫార్స్ చేస్తాం. అనుమతుల్లేకుండా కాలేజీలకు అనుబంధంగా వసతి గృహాలు కూడా నిర్వహించ కూడదు.

– పి.మురళీధర్, ఆర్ఐవో, విశాఖపట్నం

ఒత్తిడికి గురిచేస్తే సహించేది లేదు



కార్పొరేట్ కాలేజీలకు అనుబంధంగా నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్లలో విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇలాంటి వాటిపై చట్టపరంగా చర్యలకు కమిషన్ సిఫార్సు చేస్తోంది. అకాడమీ, కోచింగ్ సెంటర్లకు గుర్తింపు ఇవ్వడం ద్వారానే వాటిపై నియంత్రణ సాధ్యమవుతుంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తాం.

– డాక్టర్ జీ. సీతారాం, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు తప్పనిసరి

ఉపరవాణా కమిషనర్ రాజారత్నం

గోపాలపట్నం: జిల్లాలోని అన్ని వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని ఉపరవాణా కమిషనర్ రాజారత్నం స్పష్టం చేశారు. మాధవధార రవాణాశాఖ కార్యాలయంలో గురువారం వాహన విక్రయ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త వాహనాలకు హై సెక్యూరిటీ ప్లేట్లు అమర్చే బాధ్యత డీలర్లదేనన్నారు. ఈ బోర్డులు బిగించిన తర్వాతే వాహనాలు డెలివరీ ఇవ్వాలని ఆదేశించారు. ప్రత్యేక నంబర్ తీసుకున్న పక్షంలో రిజిస్ట్రేషన్ అయిన వెంటనే నంబర్ ప్లేట్ వాహనానికి ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 20 నుంచి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని, హై సెక్యూరిటీ బోర్డు లేని వాహన యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ బోర్డు కోసం https://www.siam.in/ను సందర్శించాలని సూచించారు. దీని ద్వారా వచ్చిన నంబర్‌ను వాహనానికి అమర్చాలన్నారు. బీహెచ్ సిరీస్‌లో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలకు సంబంధించిన అర్హతలను పూర్తిగా నిర్ధారించుకోవాలని సూచించారు. ఈ సిరీస్‌లో వాహనాలను కొనుగోలు చేసే వారు వాహనానికి సంబంధించిన రుజువు పత్రాలను సరి చూసుకున్న తర్వాతే తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ సిరీస్‌లో తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ పొందినట్లయితే మోటార్ వాహన చట్టం సెక్షన్ 55 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలోని పలువురు డీలర్లు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.